ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో విద్యుత్ సమస్యల పరిష్కారం



మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లిలో మున్సిపాలిటీ సబ్‌స్టేషన్‌లో అధిక సామర్థ్యం కలిగిన నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయగా.. శనివారం విద్యుత్ అధికారులు ప్రారంభించారు. రాబోయే వేసవిలో పెరుగుతున్న విద్యుత్ వినియోగం, అధిక లోడ్‌ల సమస్య తీర్చడానికి వేసవికార్యాచరణ ప్రణాళిక దృష్ట్యా 33/11కేవీ గుండ్లపోచంపల్లి సబ్‌స్టేషన్‌లో కొత్త 12.5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసినట్లు ఏఈ విజయ్‌కుమార్ పేర్కొన్నారు.

యువతిని వేధించిన వ్యక్తి రిమాండ్



నిందితుడు సురేష్

ఘట్‌కేసర్: యువతిని వేధించిన ఓ వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ ఘటన ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఘట్‌కేసర్‌లోని ఓ కళాశాలలో చదువుతూ హాస్టల్‌లో ఉంటున్న యువతిని ఘనాపూర్ గ్రామానికి చెందిన డ్రైవర్ బర్ల సురేష్ (35) గత కొంత కాలంగా వేధింపులకు గురిచేస్తున్నాడు. యువతి తన స్నేహితుడితో మాట్లాడుతుండగా.. వీడియో, ఫొటోలు తీసి వాటిని సోషన్ మీడియాలో పోస్ట్ చేస్తానని, తనతో శారీరకంగా కలవాలని యువతిని బెదిరించాడు. దీంతో సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు వారు కేసు నమోదు చేశారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించారు.

మహిళ అదృశ్యం



రాధా

అల్వాల్: మహిళ అదృశ్యమైన ఘటన నేరేడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. నేరేడ్‌మెట్ డిఫెన్స్ కాలనీలో నివసించే వెంపటి సుధాకర్, భార్య రాధా (29) గృహిణి. కాగా ఈనెల 4న రాత్రి భార్యభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో తెల్లవారు జామున భర్త లేచి చూసేసరికి భార్య ఇంట్లో కనిపించలేదు. దీంతో ఆచూకీ కోసం పలు చోట్ల వెతికినా లభించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అసైన్డ్ భూమిలో వెంచర్లు !

- ఇంటి అనుమతులు, డోర్ నెంబర్లు కేటాయింపు
- కనుమరుగవుతున్న ఖాళీ స్థలాలు
- పట్టించుకోని సంబంధిత అధికారులు

పోచారం: మున్సిపాలిటీ పరిధి చౌదరిగూడలోని సర్వే నెంబర్ 867లో ఉన్న ప్రభుత్వ భూమిని కాపాడేందుకు గతంలో విపక్షంలో ఉన్న నాయకులు ధర్నాలు నిర్వహించారు. ప్రస్తుతం అధికారంలో ఉండి కూడా పట్టించుకోవడం లేదని, సదరు స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై పలు అనుమానాలకు తావిస్తోంది.

ఇప్పటికే పూర్తయిన ఇళ్ల నిర్మాణాలు..

సర్వే నెంబర్ 867లో మొత్తం 20.80 ఎకరాల భూమి ఉంది. దీన్ని వ్యవసాయం చేసుకునేందుకు భవానీస్వామి, కుర్రి పెద్ద నర్సింహ, కొమ్ము యాదయ్య, హరినాథ్‌రెడ్డి, బైండ్ల ముత్యాలు, డప్పు గంధయ్య, పసుమల పీరయ్య, గ్యార పోచయ్య తదితరులకు ప్రభుత్వం కేటాయించింది. భూములకు డిమాండ్ పెరగడంతో ఇదే భూమిని ఇళ్ల స్థలాలుగా విభజించి వెంచర్లు చేశారు. కొన్ని వెంచర్లలో ఇళ్ల నిర్మాణాలు పూర్తవడంతో అవే కొత్త కాలనీలుగా ఏర్పడ్డాయి.

డోర్ నెంబర్ల కేటాయింపు..

నిర్మాణాలు పూర్తయిన ఇళ్లకు డోర్ నెంబర్లను సైతం కేటాయించారు. చౌదరిగూడ గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అసైన్డ్ భూమిలోని ప్లాట్లకు ఇంటి అనుమతులు జారీ చేశారు. ప్రస్తుతం పోచారం మున్సిపాలిటీలో చౌదరిగూడ విలీనమైన తర్వాత కూడా అసైన్డ్ భూమిలో ఈసారి ఫిబ్రవరి నెలలోనూ అనుమతులు జారీ చేశారు.

శ్రీసాయిదుర్గానగర్‌లోనే కొన్ని ఖాళీ స్థలాలు..

సర్వే నెంబర్ 867లో 14.80 ఎకరాల విస్తీర్ణంలో పలు కాలనీలు ఏర్పడ్డాయి. మిగిలిన 6 ఎకరాల్లో మరో వెంచర్ చేశారు. ఇందులో సుమారు 125 ప్లాట్లు ఉన్నాయి. ఇప్పటికే 100 ప్లాట్లలో ఇళ్లు కట్టుకున్నారు. ఈ వెంచర్‌కు శ్రీసాయిదుర్గానగర్ కాలనీగా పేరు పెట్టారు. చౌదరిగూడలోని ప్రధాన రహదారికి ఆనుకుని వెంచర్ ఉండటంతో పెద్ద పెద్ద ఖాళీ స్థలాలను కొందరు బడా నాయకులు స్వాధీనం చేసుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.



నిర్మాణంలో ఉన్న భవనం



కాలనీ సంక్షేమ సంఘం ఏర్పాటు చేసిన బోర్డు

ఎంపీగా ఉన్నప్పుడు దీక్ష..

శ్రీసాయిదుర్గానగర్‌లోని ఖాళీ స్థలాల్లో నిర్మాణాలు చేపట్టకుండా పరిరక్షించాలని మల్కాజిగిరి ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి స్థానిక నేతలతో కలిసి ధర్నా చేశారు. 5 మంది స్థిరాస్తి వ్యాపారులపై ఘట్‌కేసర్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఆ భూమి ప్రభుత్వానిదేనని రెవెన్యూ అధికారులు నిర్ధారించి, చుట్టూ ఫెన్సింగ్‌తో పాటు బోర్డులు ఏర్పాటు చేశారు. కాలక్రమేణా ఫెన్సింగ్‌తో పాటు బోర్డులను తొలగించి, కోట్లాది రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కొందరు వ్యక్తులు స్వాధీనం చేసుకుని, ప్లాట్లుగా విభజించి విక్రయించారు. కొన్ని కట్టడాలు పురోగతిలో ఉండగా.. మరికొన్ని చోట్ల నిర్మాణాలు చేపట్టేందుకు బోర్లు వేశారు.



తుది దశకు చేరుకున్న కట్టడం

నిషేధిత జాబితాలో ఉన్నా..

సర్వే నెంబర్ 867లోని 20.80 ఎకరాల విస్తీర్ణాన్ని ప్రభుత్వ నిషేధిత భూముల జాబితాలో చేర్చారు. అయినప్పటికీ రిజిస్ట్రేషన్లు, ఇంటి అనుమతులు, డోర్ నెంబర్ల కేటాయింపులు జరుగుతూనే ఉన్నాయి. జిల్లా కలెక్టర్ సహా, ఉన్నతాధికారులు పర్యవేక్షణ లోపించడంతో స్థానిక అధికారులు, నాయకులు కుమ్మక్కై ప్రభుత్వ భూములను ఆరగించేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.

తగిన చర్యలు తీసుకుంటాం..

కొర్రెములలోని సర్వే నంబర్ 867లో ఇంటి అనుమతులు ఇవ్వొద్దని పోచారం మున్సిపల్ కమిషనర్‌ను లిఖిత పూర్వకంగా కోరాం. ఇచ్చిన అనుమతులను రద్దు చేయమని చెప్పాం. ఇప్పటికే సంబంధిత వ్యక్తులకు నోటీసులు ఇచ్చామని కమిషనర్ చెప్పారు. ప్రభుత్వ భూములను పరిరక్షించేందుకు తగిన చర్యలు తీసుకుంటాం.

– డీఎస్.రజని, తహసీల్దార్, ఘట్కేసర్



అ'పూర్వ' సమ్మేళనం

మేడ్చల్‌రూరల్: మేడ్చల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1977 బ్యాచ్ పదో తరగతి పూర్వ విద్యార్థులు 48 ఏళ్ల తర్వాత ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి గౌడవెల్లిలోని రాంరెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు పాల్గొని తమ గురువులకు సన్మానం చేశారు. తమ పాఠశాల రోజులు జ్ఞాపకాలను నెమరు వేసుకుని ఆనందంగా గడిపారు. ఆటపాటలు, సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

శ్రీరామనవమికి ఆలయాల ముస్తాబు



కీసర రామాలయం



ఆలయంలో కొలువైన స్వామివారు

కీసర: శ్రీరామనవమి వేడుకలకు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లోని దేవాలయాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు ఆయా ప్రాంతాల్లోని సీతారాముల దేవాలయాలను విద్యుత్‌దీపాలతో సుందరంగా అలంకరించారు. నేడు ఉదయం కీసరగుట్ట, చీర్యాల, కీసర, రాంపల్లి, ప్రజయ్‌సాయిగార్డెన్, తదితర ప్రాంతాల్లో సీతారాముల కల్యాణోత్సవాలను కనుల పండువగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఆయా దేవాలయాల కమిటీసభ్యులు తెలిపారు.

చెట్ల తొలగింపు.. జరిమానా విధింపు !

రూ.25 వేల జరిమానా విధించిన అధికారులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అయోధ్య చౌరస్తా సమీపంలో అనుమతులు లేకుండా హరితహారం చెట్లను తొలగించిన ఓ కంపెనీ నిర్వాహకుడికి మున్సిపల్, అటవీశాఖ అధికారులు జరిమానా విధించారు. గత ప్రభుత్వం హరితహారంలో భాగంగా మొక్కలు నాటగా.. అవి ప్రస్తుతం చెట్లుగా మారాయి. శనివారం సెలవు దినం కావడంతో సమీపంలోని ఓ కంపెనీ వారు జేసీబీతో చెట్లను నేలమట్టం చేశారు. విషయం తెలుసుకున్న మున్సిపల్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ నర్సింహ్మారెడ్డి సిబ్బందిని ఘటనా స్థలికి పంపి చెట్ల తొలగింపును అడ్డుకుని అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. అటవీశాఖ, మున్సిపల్ నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా చెట్లను తొలగించడంతో వారికి రూ.25 వేల జరిమానా విధించినట్లు మున్సిపల్ ఈఈ నర్సింహ్మారెడ్డి తెలిపారు. చెట్లను తొలగిస్తున్న విషయం తెలిసిన వెంటనే అడ్డుకుని జరిమానా విధించి పర్యావరణ పరిరక్షణకు పాటుపడిన అధికారిని ప్రజలు అభినందించారు.



హరితహారం చెట్లను జేసీబీతో తొలగిస్తున్న దృశ్యం

ఔటర్‌పై మినీ వ్యాన్ బోల్తా..

ఇద్దరికి తీవ్ర గాయాలు

కీసర: టైరు పేలి మినీ పాలవ్యాన్ బోల్తా పడిన ఘటన కీసర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. పెరుగు ప్యాకెట్ల లోడ్‌తో మినీ పాలవ్యాన్ హయత్‌నగర్ నుంచి శామీర్‌పేటకు వస్తున్న క్రమంలో యాద్గర్‌పల్లి వద్ద టైర్ పేలింది. దీంతో వ్యాన్ బోల్తా పడగా.. వాహనంలో ఉన్న డ్రైవర్ మహేష్, మరో వ్యక్తి నూర్ అలాంకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను 108 సాయంతో ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇదిలా ఉండగా వ్యాన్ బోల్తా పడడంతో వ్యాన్‌లో నుంచి బయటపడిన పెరుగు ప్యాకెట్ల కోసం వాహనదారులు ఎగబడ్డారు.



బోల్తా పడిన పాల వాహనం

రాజ్యాంగ పరిరక్షణకు పాటుపడాలి

కుషాయిగూడ: రాజ్యాంగ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలని చర్లపల్లి డివిజన్ కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. శనివారం జై బాబు, జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమాన్ని చర్లపల్లి డివిజన్‌లో కార్పొరేటర్ బొంతు శ్రీదేవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రామ్ ఇన్‌చార్జి గణేష్‌నాయక్, కాంగ్రెస్ సీనియర్ నేతలు సీతారాంరెడ్డి, డివిజన్ అధ్యక్షులు సింగిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాగిళ్ల బాల్‌రెడ్డి, ప్రభుగౌడ్, శ్రీకాంత్‌యాదవ్, గోపాల్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాజీవ్ యువ వికాసం పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

పీర్జాదిగూడ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ రాజీవ్ యువ వికాసం పథకం కింద దరఖాస్తులు చేసుకునేందుకు గడువును ప్రభుత్వం ఈనెల 14 వరకు పొడిగించిందన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆఫ్‌లైన్ లేదా ఆన్‌లైన్‌లో మండల పరిషత్తు కార్యాలయం, మున్సిపల్ కార్యాలయాల్లో సమర్పించవచ్చన్నారు. దరఖాస్తు ఫామ్‌లు ప్రజాపాలన కౌంటర్లలో అందుబాటులో ఉన్నాయని కమిషనర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

చెరువులో గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహం లభ్యం

మేడ్చల్‌రూరల్: చెరువులో పడి గుర్తు తెలియని వృద్ధుడు మృతిదేహం లభ్యమైంది. ఈ ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి సుతారిగూడ గ్రామచెరువు వద్ద పారిశుద్ధ్య కార్మికులు విధులు నిర్వహిస్తుండగా.. నీటిలో ఓ వృద్ధుడి మృతదేహం కనిపించింది. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా వారు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీశారు. మృతుడికి 60 ఏళ్లు ఉంటాయని, ప్రమాదవశాత్తు నీటిలో పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. వివరాలు ఇంకా తెలియరాలేదు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు.

సన్న బియ్యం పంపిణీకి తాత్కాలిక బ్రేక్ !

పోర్టబులిటీ వెసులుబాటుతో వలసదారుల ఎగబాటు

- పక్క జిల్లాల నుంచి బియ్యం తరలింపునకు ప్రత్యేక చర్యలు
- 5.23 లక్షల రేషన్‌కార్డులకు 10,640 మెట్రిక్ టన్నుల సన్న బియ్యం
- కార్డుదారులందరికీ సన్నబియ్యం అందిస్తామంటున్న సివిల్ సప్లైశాఖ

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని పలు ప్రాంతాల్లో సన్నబియ్యం పంపిణీకి తాత్కాలికంగా బ్రేక్ పడింది. రేషన్ షాపుల వద్దకు ఆహార భద్రతా కార్డులున్న లబ్ధిదారులు వెళ్తే.. సోమవారం నుంచి సన్నబియ్యం పంపిణీ చేస్తామని డీలర్లు పేర్కొనడంతో లబ్ధిదారులు వెనుదిరిగారు.

పోర్టబులిటీ వెసులుబాటుతో ఖాళీ..

పోర్టబులిటీ వెసులుబాటుతో సన్నబియ్యం కోసం వలస కుటుంబాలు ఎగబడటంతో రేషన్‌షాపులకు విడుదలైన సన్నబియ్యం ఖాళీ అయ్యాయి. ఈ నేపథ్యంలోనే ఘట్కేసర్, మేడ్చల్ మండలాలతో పాటు వలస కుటుంబాలు అధికంగా నివసిస్తున్న ప్రాంతాల్లోని రేషన్‌షాపుల్లో సన్నబియ్యం స్టాక్ అంతా ఖాళీ అయింది.

అధికంగా పరిశ్రమలు..

మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా పరిశ్రమలకు కేంద్రంగా ఉండటం వల్ల రాష్ట్రంలోని ఇతర జిల్లాలు, ప్రాంతాల నుంచి వివిధ పనుల కోసం వచ్చిన వలస కుటుంబాలు గత కొన్నాళ్లుగా ఇక్కడే రేషన్ బియ్యాన్ని పొందుతున్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన పోర్టబులిటీతో ఆహారభద్రతా కార్డు కలిగి ఉన్న వారు ఎక్కడైనా రేషన్‌బియ్యాన్ని తీసుకునే వెసులుబాటు లభించింది.

- రాష్ట్ర ప్రభుత్వం ఉగాది నుంచి ఆహార భద్రతా కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తుండటంతో పేద ప్రజలంతా సన్నబియ్యం తీసుకునేందుకు ముందుకొస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాకు పక్క జిల్లాల్లోని గోదాముల నుంచి రేషన్ షాపులకు జిల్లా పౌరసరఫరాల శాఖ తరలించిన సన్నబియ్యం రెండు, మూడు రోజుల్లోనే ఖాళీ అయ్యాయి. దీంతో జిల్లా అధికార యంత్రాంగం ప్రత్యేక కృషితో సన్నబియ్యాన్ని రేషన్‌షాపులకు తరలించేందుకు చర్యలు తీసుకుంటోంది.

8 వేల మెట్రిక్ టన్నుల పంపిణీ..

జిల్లాలోని రేషన్‌షాపులకు ఇప్పటి వరకు తరలించిన 8 వేల మెట్రిక్ టన్నుల సన్నబియ్యం ఆహార భద్రతా కార్డుదారులకు పంపిణీ చేశారు. శనివారం సాయంత్రానికి మరో వేయి టన్నుల సన్న బియ్యాన్ని జిల్లాకు తరలించినట్లు జిల్లా పౌరసరఫరాల శాఖ జనరల్ మేనేజర్, ఇన్‌చార్జ్ డీఎస్ఓ సుగుణబాయి తెలిపారు. మిగతా స్టాక్ కూడా త్వరలో జిల్లాకు చేరుకుంటుందని పేర్కొన్నారు. బియ్యం కోసం ఎవ్వరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు ప్రకటించాయి.

5.23 లక్షల రేషన్ కార్డులు..

మేడ్చల్ జిల్లాలోని 619 రేషన్ దుకాణాల ద్వారా 5,23,938 రేషన్‌కార్డు దారులకు ప్రతినెల ఉచితంగా ఒకరికి 6 కిలోల చొప్పున బియ్యం పంపిణీ చేస్తున్నారు. ఇందులో 17,18,351 మంది లబ్ధిదారులు (యూనిట్లు) ఉండగా.. ఒకరికి 6 కిలోల చొప్పున 10640.052 మెట్రిక్ టన్నుల బియ్యం అందజేస్తున్నారు. ఉగాది కానుకగా ఈనెల నుంచి రేషన్ దుకాణాల ద్వారా లబ్ధిదారులకు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సన్నబియ్యం అందిస్తున్నట్లు పౌరసరఫరాల శాఖ అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

దరఖాస్తుల వికాసం !

- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుంచి వచ్చిన దరఖాస్తులు 29,669
- స్వయం ఉపాధికి బ్యాంకు లింకేజీ కింద రూ.లక్ష నుంచి రూ.4 లక్షలు

సాక్షి, సిటీబ్యూరో: ప్రభుత్వం నిరుద్యోగ యువతీ యువకులకు స్వయంఉపాధి కల్పించేందుకు ప్రవేశపెట్టిన 'రాజీవ్ యువ వికాసం' పథకానికి దరఖాస్తులు వెల్లువెత్తుతున్నాయి. శివారు మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాలు, 16 పురపాలక సంఘాల (కొత్తగా ఏర్పాటు కానున్న మూడింటితో కలిపి) పరిధిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల నుంచి 29,669 దరఖాస్తులు అందాయి.

వర్గాల వారీగా..

బీసీ వర్గాల నుంచి 16,300 దరఖాస్తులు రాగా.. ఎస్సీల నుంచి 8,036, మైనార్టీల నుంచి 4,068, ఎస్టీల నుంచి 1,265 దరఖాస్తులు వచ్చాయి. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నప్పటికీ, ప్రింట్ కాపీని సంబంధిత మండలాలు లేదా పురపాలకసంఘాల్లో అందజేయాల్సి రావడంతో దరఖాస్తుదారులకు ఇక్కట్లు తప్పడం లేదు. రేషన్‌కార్డు(ఆహారభద్రతా కార్డు) లేని వారికి ఆదాయ ధ్రువపత్రంతో దరఖాస్తు చేసుకునేలా.. ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. ఆదాయ ధ్రువపత్రం మంజూరుకు రేషన్‌కార్డు తప్పనిసరి కావాల్సి ఉండటంతో దరఖాస్తుదారులు ఇబ్బందులు పడుతున్నారు.

దరఖాస్తులు ఇలా..

మీ సేవా కేంద్రాలకు వెళ్లకుండానే ఉచితంగా ఫోన్ నుంచి దరఖాస్తు చేసుకునేలా ప్రభుత్వం వెసులుబాటు కల్పించింది. 'రాజీవ్ యువ వికాసం' అధికారిక వెబ్‌సైట్‌ను కూడా ప్రారంభించారు. అందులో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, సామాజిక వర్గాలకు సంబంధించిన ఆప్షన్లను దరఖాస్తుదారుడు ఎంపిక చేసుకుని క్లిక్ చేయాలి. వెంటనే దీనికి సంబంధించిన వివరాలు కనిపిస్తాయి. వాటిలో ఆధార్ కార్డులో ఉన్న పేరు, ఆధార్‌కార్డు నంబరు నమోదు చేయగానే ఆటోమెటిక్‌గా రేషన్‌కార్డు నంబర్ అందిస్తోంది. అనంతరం తండ్రిపేరు, ఇంటి నంబర్, చిరునామాతో పాటు, కులం, ఆదాయం ధ్రువీకరణ వివరాలు, దరఖాస్తుదారుడు తీసుకునే రుణం (గొర్రెలు, గేదెల పెంపకం, దుస్తుల వ్యాపారం, జిరాక్స్ సెంటర్) పలు యూనిట్ల వివరాలను నమోదు చేసుకోవాలి. అనంతరం పాన్‌కార్డు నంబర్, బ్యాంకు ఖాతా వివరాలను నమోదు చేసి పాస్‌ఫొటో, పాన్‌కార్డును అప్‌లోడ్ చేసి డిక్లరేషన్ ఇచ్చి పూర్తిచేయాల్సి ఉంటుంది. దరఖాస్తు ఫారమ్ డౌన్‌లోడ్ చేసుకుని సంబంధిత పురపాలక సంఘం లేదా ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు అందజేయాల్సి ఉంటుంది.

తుదిగడువు ఈనెల 14 వరకు..

రాజీవ్ యువ వికాసం పథకానికి రేషన్‌కార్డు, బ్యాంకు ఖాతా లేని వారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రభుత్వం రేషన్ కార్డు తప్పనిసరి చేయడంతో కార్డులేని వారు సంక్షేమ పథకాలకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. దీంతో అర్హులైన వారికి కార్డులేకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. పథకానికి దరఖాస్తు చేసుకునేందుకు ఈనెల 4 నుంచి 14 వరకు గడువు పెంచడంతో కార్డులేని వారికి కొంత ఉపశమనం లభించింది. అర్హులైన వారికి రేషన్ కార్డులు అందించాలని ప్రజలు కోరుతున్నారు. బ్యాంకు ఖాతాలు లేని అర్హులు కూడా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బ్యాంకు లింకేజీ రుణానికి జాతీయ బ్యాంకుల్లో మాత్రమే ఖాతా (అకౌంట్) ఉండాల్సి రావడంతో ప్రైవేట్ బ్యాంకుల్లో ఖాతా ఉన్న వారు జాతీయ బ్యాంకుల్లో ఖాతాలు తెరిచేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

బాబూ జగ్జీవన్‌రామ్ గొప్ప సంఘ సంస్కర్త

ఘనంగా బీజేఆర్ జయంతి వేడుకలు

మేడ్చల్ జోన్ పరిధిలో బాబూ జగ్జీవన్ రామ్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శనివారం వివిధ పార్టీల నాయకులు ఆయన విగ్రహం, చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలను గుర్తుచేసుకుని, కొనియాడారు.

– మేడ్చల్ జోన్ బృందం



కిష్టాపూర్‌లో..



జవహర్‌నగర్‌లో మహనీయుల ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో..



ఘనాపూర్‌లో..



బాబూ జగ్జీవన్‌రామ్ జయంతి వేడుకల్లో స్థానిక నేతలు



మేడ్చల్‌లో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు



ప్రతాపసింగారంలో మాజీ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి